

పథకాల అమలు తీరు బాగుంది

రాష్ట్రంలో పథకాల అమలు తీరు బాగుందని మలేషియా విదేశీ వ్యవహారాల సెక్రటరీ నుష్మ అన్నారు.

- 8లో▸



దళితుల అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదు

దళితుల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివ రావు అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

42.5^0/32.5^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచే ఎండ ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు హైకోర్టు జడ్జి రాక

భూపాలపల్లి అర్బన్: తెలంగాణ హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి ఎస్.తుకారాంజీ నేడు (శనివారం) జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టును ప్రారంభించనున్నారు. జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కోర్టును ప్రారంభించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నారాయణబాబు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎదులపురం శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన



మహబూబాబాద్ రూరల్: యూనిఫాం సర్వీసెస్ కొలువుల భర్తీలో భాగంగా తుదిరాత పరీక్షలో అర్హత సాధించిన వివిధ విభాగాల్లోని ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన మహబూబాబాద్ పోలీస్ కార్యాలయ ఆవరణలో మూడో రోజు శుక్రవారం కొనసాగింది. 751 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు నిర్ణయించగా.. 604 మందివి పరిశీలించారు. కాగా 19మంది అభ్యర్థులు వాయిదా వేయాలని కోరారని, 128 మంది గైర్హాజరయ్యారని పోలీసు అధికారులు తెలిపారు.

పద్మశాలి సంఘం జిల్లా కన్వీనర్‌గా రాజేంద్రప్రసాద్



భూపాలపల్లి రూరల్: పద్మశాలి సంఘం జిల్లా కన్వీనర్‌గా ఎలగొండ రాజేంద్రప్రసాద్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఫౌండర్ రామ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కోకన్వీనర్లుగా అడ్డగట్ల శ్రీధర్, క్యాతం అనిల్ కుమార్, నిమ్మల దశరథం, కందకట్ల రాజులను నియమించినట్లు తెలిపారు. భూపాలపల్లి పట్టణానికి చెందిన ఎలగొండ రాజేంద్రప్రసాద్ కొన్ని సంవత్సరాలుగా పద్మశాలి కులస్తుల ఐక్యత కోసం సంఘం నిర్మాణంలో జిల్లాలో ప్రధాన పాత్ర పోషించినందున ఆయన సేవలను గుర్తించి జిల్లా కన్వీనర్‌గా నియమించినట్లు ప్రకటించారు.

కష్టపడే వారికి తగిన గుర్తింపు



ములుగు: పార్టీ అభివృద్ధి కోసం కష్టపడే ప్రతిఒక్కరి తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందని ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ చిత్తశుద్ధితో పని చేస్తే ఉన్నత పదవులు తప్పక లభిస్తాయన్నారు. దీనికి నిదర్శనమే రవి యాదవ్‌కు బీసీసెల్ జిల్లా అ ధ్యక్ష పదవి లభించడమేనన్నారు. నూతనంగా బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన రవికి అభినందనలు తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతా లకు, ఆదర్శాలకు అంకితమై నీతి, నిజాయితీ, క్రమ శిక్షణ, చిత్తశుద్ధితో వ్యవహరిస్తూ సహచర కార్యకర్తలు, పార్టీ కమిటీలతో కలిసి అన్ని కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలన్నారు. ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పోరాటాలు చేప ట్టి పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. అనంతరం రవి మాట్లాడుతూ క్రమశిక్షణ గల పార్టీ కార్యకర్తగా పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. ఈ కా ర్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, వివిధ మండలాల అధ్యక్షులు ఎండీ చాంద్ పాషా, పాలడుగు వెంకటకృష్ణ, ఆకుతోట చంద్రమౌళి, చింతనిప్పుల భిక్షపతి, గండె శ్రీను, ఒజ్జల లింగయ్య, గుండెబోయిన రమేష్, షకీల్, శ్యామ్, మౌలానా, జాఫర్, శంకర్, బోయిన రాజు, ఓంప్రకాష్, కనతల నాగేందర్ రావు, ఎంపీటీసీ గోపిదాసు, ఏడుకొండలు, తిరుపతి పాల్గొన్నారు.

కేంద్రం కుట్రపూరిత ధోరణిని ఎండగట్టాలి

ములుగు రూరల్: జాతీయ ఉపాధి హామీ పథకంపై కేంద్రం అవలంబిస్తున్న కుట్రపూరిత ధోరణిని ఎండగట్టాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని మల్లంపల్లి, దేవనగర్, శ్రీనగర్ గ్రామ పంచాయతీలకు సంబంధించిన 300 మంది ఉపాధి హామీ కూలీలతో మల్లంపల్లి–నర్సంపేట జాతీయ రహదారి 163పై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద్‌నాయక్ మాట్లాడారు.

సాగుకు సిద్ధం

దుక్కులు దున్నుకొని..
విత్తనాల కొనుగోలులో రైతులు

- నరిపడా ఎరువులు, విత్తనాలు రెడీ
- వానలు, రైతుబంధు కోసం ఎదురుచూపు
- జిల్లాలో 2,44,138 ఎకరాల్లో పంటల సాగు



టేకుమట్లలో దుక్కిదున్ని సాగుకు సిద్ధంగా ఉన్న భూమి

భూపాలపల్లి: వానాకాలం పంటల సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ట్రాక్టర్లతో దుక్కులు దున్ని.. విత్తనాల కొనుగోలు ప్రారంభించారు. కొందరు వానల కోసం ఎదురుచూస్తుండగా.. మరికొందరు ప్రభుత్వం అందించనున్న రైతుబంధు పెట్టుబడి సాయంకోసం ఎదురుచూస్తున్నారు.

జిల్లాలో ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో మొత్తం 2,44,138 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగుచేయనుండగా, అందులో ప్రధానంగా పత్తి, వరి పంటలకే ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అధికంగా వరి 1,05,600 ఎకరాలు, పత్తి 1,02,600 ఎకరాల్లో సాగు జరుగనున్నట్లు తెలుస్తోంది. ఇందు కోసం రైతులు కూడా తమతమ పనుల్లో నిమగ్నం అయ్యారు. ఇప్పటికే ట్రాక్టర్లతో దుక్కులు దున్ని భూములను సిద్ధం చేసుకున్నారు. వ్యవసాయశాఖ అధికారులు సైతం రైతులు సాగుచేయనున్న పంటలను ముందే అంచనావేసి విత్తనాలు, ఎరువులను సిద్ధంగా ఉంచారు. వానాకాలం సీజన్‌కు పక్కా యాక్షన్ ప్లాన్‌ను రెడీ చేసుకొని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికలు రూపొందించారు.

కరుణించని వరుణుడు..

ప్రతీ ఏడాది జూన్ రెండవ వారంలో వర్షాలు ప్రారంభం అయ్యేవి. కానీ ఈసారి ఆలస్యం కావడంతో రైతులు వానాల కోసం ఎదురుచూస్తున్నారు. కాలం ఎట్ల చేస్తదో అంటూ ఆందోళన చెందుతున్నారు. వచ్చే వారంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంతో అన్నదాతల్లో కొంత ఊరట కలిగింది. గత యాసంగి సీజన్‌లో పంట దిగుబడి మంచిగా సాధించిన వారు ఇప్పటికే విత్తనాలను కొనుగోలు చేశారు. పలువురు రైతులు చేతిలో డబ్బులు లేక రైతుబంధు సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 2022 వానాకాలం సీజన్‌లో 1,08,197 మంది రైతులకు రూ.112.79 కోట్లు, యాసంగిలో 1,07,060 మంది రైతులకు రూ.111.23 కోట్లు అందగా ప్రస్తుత సీజన్ పెట్టుబడి సహాయం కోసం వందలాది మంది రైతులు ఎదురు చూస్తున్నారు. మరికొందరు రైతులు చేసేది లేక వడ్డీ, అడ్తీ వ్యాపారుల వద్ద పెట్టుబడి కోసం అప్పులు చేస్తున్నారు.

ఫర్టిలైజర్స్ వివరాలు(మెట్రిక్ టన్నుల్లో)..

రకం	కావాల్సినవి	అందుబాటులో ఉన్నవి
యూరియా	29,297	7872
డీఏపీ	8545	1174
ఎంఓపీ	6103	164
కాంప్లెక్స్	8545	3443
ఎస్ఎస్‌పీ	244	161

వానాకాలం పంటల సాగు అంచనా(ఎకరాల్లో)

వరి	1,05,600
పత్తి	1,02,600
మొక్కజొన్న	560
జొన్న	250
పల్లి	220
పెసరు	820
ఆయిల్ పామ్	4,250
మిర్చి	22,320
పసుపు	1068
ఇతర పంటలు	6,450
మొత్తం	2,44,138

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ శ్రీహర్షిణి

- జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి
- వ్యవసాయ రంగంపై దృష్టి సారించాలి
- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్: రైతులు పంటలు సాగుచేయడానికి సిద్ధంగా ఉన్నారని, విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాలని అధికారులను జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిని ఆదేశించారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో శ్రీహర్షిణి అధ్యక్షతన జరిగిన జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనసభ్యులు గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు అభివృద్ధిపై ప్రజాప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్నది వర్షాకాలం కాబట్టి గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లావ్యాప్తంగా మండలకేంద్రాల్లో వైద్యాధికారి అందుబాటులో ఉండాలని చెప్పారు. రాష్ట్రంలో మత్స్య సంపద గణనీయంగా పెరిగిందన్నారు. పెద్ద చెరువుల్లో రొయ్యల పెంపకంపై దృష్టి సారించాలని సూచించారు. రైతులు వరి కొయ్యలను తగలబెట్టవద్దని చెప్పారు. ఈ సమావేశాల్లో జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ రఘువరన్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ కల్లెపు శోభ, జెడ్పీటీసీలు, జిల్లా వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, అటవీ శాఖ, మత్స్య శాఖ, పశు సంవర్ధక శాఖ, జిల్లా క్రీడా శాఖ అధికారులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన అవినీతి

జమ్మూకశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి నిర్మల్‌సింగ్



జమ్మూకశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి నిర్మల్‌సింగ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

టేకుమట్ల(రేగొండ): బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో అవినీతి పేరుకుపోయిందని జమ్మూకశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి నిర్మల్‌సింగ్ అన్నారు. శుక్రవారం రేగొండ మండలకేంద్రంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి ఆధ్వర్యంలో మోర్చాల సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన నిర్మల్‌సింగ్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల పేరుతో కేసీఆర్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దోచుకుంటుందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వాటాతో రాష్ట్రంలో సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ రాష్ట్ర ఖజానాతో రాష్ట్రం అభివృద్ధి చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. స్కాంలకు మారుపేరుగా నిలుస్తూ రాష్ట్ర ప్రతిష్టను రోడ్డున పడేస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కేసీఆర్ కూతురు కవిత నిందితురాలని, రాష్ట్ర ఆడబిడ్డలకు కేసీఆర్ కుటుంబం ఏం సమాధానం చెప్తారని అన్నారు. సొమ్ము కేంద్రానికి, సోకు కేసీఆర్‌ది అన్నట్లు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి మాట్లాడుతూ నియంత పాలన అంతమొందించాలంటే బీజేపీ అధికారంలోకి రావాలన్నారు. బీజేపీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. రాష్ట్రాన్ని అప్పుల పాలుచేస్తూ సంక్షేమ పథకాల పేరుతో ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అవినీతి ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్మల్‌సింగ్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కన్నం యుగేందర్, మండల అధ్యక్షుడు దాసరి తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడునూతుల నిశీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లింగంపెల్లి ప్రసాద్‌రావు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు వెన్నంపల్లి పాపన్న, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న జీఎం శ్రీనివాసరావు

భూపాలపల్లి అర్బన్: ప్రతి ఉద్యోగి చుట్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం ఏరియాలోని జీఎం కార్యాలయంలో అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి జీఎం హాజరై మాట్లాడారు. ఇంటి ఆవరణతో పాటు చుట్టు పరిసరాలను, గని ఆవరణలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్లాస్టిక్ వాడాకాన్ని తగ్గించాలని సూచించారు. గనులపై కార్మికులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటు జీఎం వెంకటయ్య, అధికారులు తుకారాం, వెంకటరామిరెడ్డి, వేంకటేశ్వర్‌రావు, రామలింగం, కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

బహిరంగ సభ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



నేడు వరంగల్‌కు మంత్రి కేటీఆర్

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్న మంత్రి
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- గులాబీమయమైన నగర రహదారులు
- సభాస్థలిని పరిశీలించిన మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే నరేందర్
- సాయంత్రం బహిరంగ సభకు భారీగా జన సమీకరణ



కరీమాబాద్/ఖిలా వరంగల్/గీసుకొండ: రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు శనివారం వరంగల్ పర్యటనకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వరంగల్ ఫోర్ట్ రోడ్డులో పారిశుద్ధ్య సిబ్బంది చెత్తాచెదారాన్ని తొలగించారు. ప్రధాన రహదారులు గులాబీమయమయ్యాయి. ఆర్టీఏ జంక్షన్, శంభునిపేట జంక్షన్, ఖిలావరంగల్ జంక్షన్, చింతల్ ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రాంతాల రహదారులను గులాబీ తోరణాలతో ముస్తాబు చేశారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఫ్లెక్సీలు, కటౌట్లు, స్వాగత తోరణాలు పోటాపోటీగా ఏర్పాటు చేశారు. బహిరంగ సభ జరిగే ఆజంజాహి మిల్లు గ్రౌండ్‌లో భారీ వేదికను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మంత్రి పర్యటన, బహిరంగ సభను విజయవంతం చేసేందుకు తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించారు. జన సమీకరణ కోసం కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలకు సూచనలు చేశారు.

సభాస్థలి పరిశీలన..

మంత్రి కేటీఆర్ పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం ఆజంజాహి మిల్లు గ్రౌండ్‌లో బహిరంగసభ జరుగనుంది. సభాస్థలిని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పరిశీలించారు. సభ నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు సూచనలు చేశారు. అదేవిధంగా గీసుకొండ మండలం శాయంపేటలోని మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో యంగ్‌వన్ కంపెనీ పనులకు శంకుస్థాపన నేపథ్యంలో అక్కడి ఏర్పాట్లను కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ అశ్వినితానాజీ, డీసీపీ కరుణాకర్, ఏసీపీ కృపాకర్ తదితరులు పరిశీలించారు.



వరంగల్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

మంత్రి టూర్ షెడ్యూల్..

- ఉదయం 9.30 –11.45 వరకు గీసుకొండ మండలం శాయంపేటలోని మెగా టెక్స్‌టైల్ పార్కులో యంగ్‌వన్ కంపెనీ నిర్మాణానికి శంకుస్థాపన
- మధ్యాహ్నం 12 గంటలకు వరంగల్ కోటలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరిక
- 12.15 గంటలకు తూర్పు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ప్రారంభోత్సవం
- 12.45 భోజనం
- 1.30 నుంచి 6.00 గంటల వరకు : వరంగల్ సమీకృత జిల్లా కార్యాలయాల కాంప్లెక్స్‌కు భూమిపూజ, దేశాయిపేటలో డబుల్ బెడ్ రూం ఇండ్ల ప్రారంభోత్సవం, జిల్లా వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మాణానికి శంకుస్థాపన, కొత్తవాడలో కొండా లక్ష్మణ్‌బాపూజీ, నేతన్నల విగ్రహావిష్కరణ, మండిబజార్ మైనార్టీ డెవలప్‌మెంట్ (ఈద్గా, దర్గాలు, మసీదుల నిర్మాణం) పనులు ప్రారంభిస్తారు. పోచమ్మమైదాన్‌లో హరిత హోటల్ నిర్మాణానికి శంకుస్థాపన, వరంగల్ చౌరస్తాలో 16 స్మార్ట్‌రోడ్లు ప్రారంభం, వరంగల్‌లో అధునాతన బస్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపనతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.
- 6.30 గంటలకు వరంగల్ ఓ సిటీలో జరిగే బహిరంగ సభకు హాజరు
- 7.00 రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్‌కు పయనం

రేపు శ్రీ శృంగేరి శివగంగ మఠాధిపతి రాక

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానానికి ఈనెల 18న ఆదివారం శ్రీశృంగేరి శివగంగ మఠాధిపతి శ్రీశ్రీశ్రీ పురుషోత్తమ భారతిస్వామి రానున్నట్లు తెలిసింది. అదేరోజు రాత్రి 8గంటలకు వేములవాడ సత్రంలో శ్రీచంద్రమౌళీశ్వర పూజ చేయనున్నారు. 19న సోమవారం ఉదయం 9గంటలకు గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిసింది.

పట్టణాల అభివృద్ధికి పటిష్ట చర్యలు

ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి అర్బన్: రాష్ట్రంలో ప్రతి పట్టణం ప్రగతి కాంతులతో కళ కళలాడుతున్నాయని.. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన దిశగా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో కలెక్టర్ భవేష్‌మిశ్రాతో కలిసి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవంలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణిసిద్దు జాతీయ పతాకావిష్కరణ చేశారు. ట్రాక్టర్లు, స్వచ్ఛ ఆటోలతో మున్సిపల్ కార్మికులు సిబ్బంది, మెప్మా, కౌన్సిల్ సభ్యులు, కళాకారులు సంతోషిమాత ఆలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా మీదుగా మున్సిపల్ కార్యాలయం వద్దకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవ వేడుకలలో జ్యోతి ప్రజ్వలన చేసి భూపాలపల్లి పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటనాఫి సిద్దు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ దార్శనికత్వం మేరకు భూపాలపల్లి గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీ.. జిల్లాగా మారిందన్నారు. కౌన్సిల్ మెంబర్‌లు టీం వర్క్‌గా క్రియాశీలకంగా సేవలు అందిస్తున్నారని చెప్పారు. తద్వారా పట్టణం అభివృద్ధి జరుగుతుందన్నారు. మున్సిపాలిటీలోని కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు పోటీతత్వంతో ప్రజలకు నిరంతరం సేవ చేస్తున్నారని తెలిపారు. కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం సాధించిన తర్వాత వివిధ శాఖలలో చేపట్టిన అభివృద్ధి పనులను తెలుసుకునేందుకు ప్రభుత్వం రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను 21రోజుల పాటు నిర్వహిస్తుందన్నారు. భూపాలపల్లి ప్రాంతం గ్రామ స్థాయి నుంచి ప్రస్తుతం మున్సిపాలిటీ, జిల్లా స్థాయి వరకు అభివృద్ధి చెందిందని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పురోగతి సాధించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దివాకర, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శోభ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ హరిబాబు, మున్సిపల్ కమిషనర్ అనిల్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


దేవాదుల పంప్‌హౌస్‌లో పూడికతీత షురూ



కన్నాయిగూడెం: మండలంలోని తుపాకులగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని గుట్టగంగారం వద్ద నిర్మించిన దేవాదుల పంపింగ్ వద్ద ఉన్న నీటి కాల్వలో అధికారులు పూడికతీత పనులు చేపట్టారు. గత కొన్ని రోజుల నుంచి పంపింగ్‌కు నీరు వచ్చే కాల్వలో ఇసుక మేటలు చేరడంతో పూడికతీతను చేపట్టారు. పైగా వేసవి ముగిసి వర్షాకాలం వస్తున్న తరుణంలో అధికారులు ఇసుకను తొలగించే పనిలో పడ్డారు. ఇసుకను తొలగిస్తే నీటి పంపింగ్‌కు అనువుగా ఉంటుంది. దీంతో నీటిని కాల్వలకు రాకుండా అడ్డుగా కట్టను ఏర్పాటు చేసి ఇసుకను జేసీబీతో తీస్తున్నారు.

వడదెబ్బతో యాచకుడి మృతి

పట్టించుకోని కాళేశ్వర దేవస్థానం అధికారులు



కొరిత రమేష్ మృతదేహం

కాళేశ్వరం: కొన్నేళ్లుగా కాళేశ్వరం ఆలయం సమీపంలో భిక్షాటన చేస్తున్న యువకుడు శుక్రవారం వడదెబ్బతో ఆలయ ప్రాంగణంలో మృతిచెందాడు. విషయం తెలిసినప్పటికీ దేవస్థానం అధికారులు, సిబ్బంది పట్టించుకోలేదు.

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కొరిత రమేష్(35)కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి దేవస్థానం ఆలయ ఆవరణ సూర్యదేవాలయం సమీపంలో కొన్నేళ్లుగా భిక్షాటన చేస్తున్నాడు. ఎండ తీవ్రత తట్టుకోలేక శుక్రవారం మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో ఆలయ ఆవరణలో మృతిచెందాడు. సాయంత్రం 6:30 గంటల వరకు కూడా ఆలయ సిబ్బంది పట్టించుకోలేదు. దీంతో స్థానికులు సర్పంచ్ వెన్నపురెడ్డి వసంతమోహన్‌రెడ్డికి సమాచారం అందించారు. మృతదేహాన్ని సర్పంచ్ గ్రామపంచాయతీ ట్రాక్టర్‌లో మృతుడి కుటంబసభ్యులకు అప్పగించారు. గోదావరి తీర ప్రాంతంలో వారి కుటుంబ సభ్యులు ఖననం చేశారు.

సంప్రోక్షణతో తెరిచి..

మధ్యాహ్నం మృతిచెందితే సాయంత్రం 6.30 గంటల వరకు కూడా ఆలయం మూసి ఉంది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి నాలుగు గంటల వరకు భోజన విరామం ఉంటుంది. నాలుగు గంటలకు తెరువాల్సిన ఆలయం ఏడు గంటల వరకు మూసి ఉంది. 7.30గంటలకు సంప్రోక్షణ జరిపారు. అప్పటి వరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దేవస్థానం అధికారులపై ధ్వజమెత్తారు. మృతదేహాన్ని తీసుకెళ్లిన అనంతరం సంప్రోక్షణ జరిపి ఆలయం తెరిచి భక్తులకు దర్శనం కల్పించారు.

క్లుప్తంగా

పథకాల అమలు తీరు బాగుంది

- మలేషియా విదేశీ వ్యవహారాల సెక్రటరీ సుష్మ



హన్మకొండ అర్బన్ : తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు తీరు బాగుందని మలేషియా విదేశీ వ్యవహారాల సెక్రటరీ సుష్మ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌కు వచ్చిన సుష్మను కలెక్టర్ సిక్తా పట్నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలికారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సిక్తా పట్నాయక్‌తో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుష్మ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు బాగున్నాయని, వాటిని ప్రజలు కూడా వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణ అద్భుత ప్రగతి సాధించిందన్నారు. మలేషియాలో కూడా 5వేలకు పైగా తెలుగు ప్రజలు నివసిస్తారని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు చక్కగా పాటిస్తారని తెలిపారు. దీపావళి పండుగను ఘనంగా జరుపుకుంటారని వెల్లడించారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. అనంతరం నూతన కలెక్టరేట్ కాంప్లెక్స్, ఉపాధి హామీ పథకం, పెన్షన్లు, జిల్లా పంచాయతీ శాఖ, రైతు బంధు, దళిత బంధు, వ్యవసాయశాఖ, ఇండస్ట్రీస్, విద్యా, ఆరోగ్య శాఖల ప్రగతిని అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీపీఓ జగదీశ్వర్, జీఎం ఇండస్ట్రీస్ హరిప్రసాద్, డీఈఓ అబ్దుల్ హై, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, డీఏఓ రవీందర్‌సింగ్, ఏడీ అగ్రికల్చర్ దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదు



వరంగల్ చౌరస్తా: స్వాతంత్ర్య భారతంలో 75 ఏళ్లుగా దళితుల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నట్టుగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈనెల 16 నుంచి 18 వరకు నిర్వహించనున్న దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ శిబిరాన్ని హంటర్ రోడ్డులో సాయినగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్ర అధ్యక్షుడు బందెల నర్సయ్య, జన్ను రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాంబశివరావు మాట్లాడారు. అంబేడ్కర్ రాజ్యాంగంలో ప్రతి ఒక్కరికీ సమాన ఓటు హక్కు కల్పించారని పేర్కొన్నారు. దళితుల ఆర్థిక, రాజకీయ శక్తిని పెంచడానికి కనీస వేతనాలు, ఉపాధి పథకాలు, భూ సంస్కరణలు నేటి ప్రభుత్వాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. శిక్షణ శిబిరాల్లో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు యేసు రత్నం, అనిల్ కుమార్, లక్ష్మణ్, పోచన్న, రత్నకుమారి, రవి, భిక్షపతి పాల్గొన్నారు.



కేఎంటీపీకి మరో కిరీటం యంగ్‌వన్..!

- 298 ఎకరాల్లో రూ.840కోట్ల పెట్టుబడితో వస్త్రపరిశ్రమ
- 12వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశం
- నేడు మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన
- కేఎంటీపీకి ఇప్పటికే 'మిత్ర'లో చోటు



గీసుకొండ: కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ)లో మరో దిగ్గజ కంపెనీ తన యూనిట్‌ను ప్రారంభించే శుభ సమయం వచ్చేసింది. దక్షిణ కొరియాకు చెందిన ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మల్టీనేషనల్ కంపెనీ యంగ్‌వన్ ఇక్కడ భారీ పరిశ్రమ యూనిట్‌ను నెలకొల్పడానికి అన్ని ఏర్పాట్లు జరిగాయి. జిల్లాలోని గీసుకొండ–సంగెం మండలాల పరిధిలో ఏర్పాటైన కేఎంటీపీలో యంగ్‌వన్ కార్పొరేషన్(కంపెనీ) పరిశ్రమ యూనిట్‌కు రాష్ట్ర మంత్రి కేటీఆర్ శనివారం(నేడు) ఉదయం 9.30 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు యంగ్‌వన్ కంపెనీ చైర్మన్ కిహాక్ సంఘ్‌తోపాటు ఆ దేశానికి చెందిన దౌత్యవేత్తలు, కంపెనీ ప్రతినిధులు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్, టీఎస్‌ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి వస్తున్నారు. యంగ్‌వన్ కంపెనీకి కేఎంటీపీలో 298 ఎకరాల స్థలం కేటాయించగా రూ.840 కోట్ల పెట్టుబడితో పరిశ్రమను నెలకొల్పనున్నారు. పనులు పూర్తి అయితే ఈ కంపెనీ యూనిట్ ద్వారా సుమారు 12వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ప్రత్యక్షంగా లభిస్తాయని చెబుతున్నారు. దేశంలోనే వస్త్ర పరిశ్రమకు యంగ్‌వన్ కంపెనీ ఏర్పాటు మైలురాయిగా నిలుస్తోందని అంటున్నారు. కేఎంటీపీ చరిత్రలో భారీ పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన తొలి విదేశీ కంపెనీగా యంగ్‌వన్ నిలుస్తోంది. ఇప్పటికే రెండు కంపెనీలు ఇక్కడ యూనిట్లను ఏర్పాటు చేయడానికి ముందుకు రాగా తొలుత ఉత్తర ప్రదేశ్ కాన్పూర్ కేంద్రంగా ఉన్న గణేశా ఎకోటెక్, ఎకోపెట్ కంపెనీ వాడిన ప్లాస్టిక్ బాటిల్స్ నుంచి యార్న్(దారం) తయారు చేసే యూనిట్‌ను ప్రారంభించి ఉత్పత్తి కొనసాగిస్తోంది. ఈ కంపెనీకి 50 ఎకరాల భూమిని కేటాయించగా, సుమారు 800 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. అలాగే కేరళకు చెందిన కైటెక్స్ చిన్న పిల్లల గార్మెంట్ల తయారీ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం రెడ్‌కార్పెట్ పరిచింది. కేరళ ప్రభుత్వం నుంచి సహకారం అందకపోవడంతో కంపెనీ కేఎంటీపీలో యూనిట్‌ను నెలకొల్పడానికి ముందుకు వచ్చింది. ఈ కంపెనీకి 187.24 ఎకరాల భూమిని కేటాయించగా పనులు ప్రారంభించింది. సుమారు రూ.1,013కోట్ల పెట్టుబడితో యూనిట్ ఏర్పాటు పనులు చేపట్టారు. ఉత్పత్తి ప్రారంభమైతే సుమారు 11వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ముఖ్యంగా కుట్టు శిక్షణ పొందిన మహిళలకు ఇది కల్పతరువుగా ఉంటుందని చెబుతున్నారు. ఇటీవల ప్రధాని మోదీ కేఎంటీపీకి మిత్రలో చోటు కల్పిస్తున్నట్లు ప్రకటించారు. పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్కులు ఫాం.. ఫైబర్. ఫ్యాక్టరీ.. ఫ్యాషన్.. ఫారిన్. విధానంతో పీఎం మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజన్ అండ్ అపెరల్ (పీఎం మిత్ర) కింద మొత్తం దేశంలో ఏడు పార్కులను ఎంపిక చేయగా వాటిలో రాష్ట్రంలో కేఎంటీపీ ఉండటం విశేషం. దీంతో కేంద్రం నుంచి పార్కు అభివృద్ధికి భారీగా నిధులు వచ్చే, మౌలిక సదుపాయాలు కల్పించే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం పార్కులో మౌలిక సదుపాయాలకు రూ.1,100 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించగా ఇప్పటి వరకు సుమారు రూ.500కోట్ల వరకు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

క్రీడా ఉత్పత్తుల తయారీ

యంగ్‌వన్ కంపెనీ తన వియత్నాం, బంగ్లాదేశ్ యూనిట్ల తరహాలో కేఎంటీపీలో క్రీడలకు సంబంధించిన సింథటిక్ జాకెట్లు, బూట్లు, ట్రాక్‌సూట్లు, వాటర్‌ప్రూఫ్ డ్రస్ మెటీరియల్స్, ట్రెక్కింగ్‌కు వాడే వస్తువులు, మ్యాట్లు, ఓవెన్ నైలాన్, పాలియిస్టర్ వస్త్రాలు, సైక్లింగ్ కు ఉపయోగించే దుస్తులు, హ్యాండ్ బ్యాగులు, క్యాన్‌వాస్ బూట్లు, వస్త్ర మెటీరియల్స్‌ను తయారు చేసే అవకాశం ఉంది.

భూ నిర్వాసితులు, వలస వ్యాపారుల అసంతృప్తి

సీఎం కేసీఆర్ 2017, అక్టోబర్ 22న కేఎంటీపీకి శంకుస్థాపన చేశారు. పరిశ్రమ కోసం భూములు ఇచ్చిన రైతులకు ఎకరానికి వంద గజాల ఇంటి స్థలం ఇస్తామని, ఇంటికో ఉద్యోగం ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అలాగే ఎకరం భూమిని రైతుల నుంచి రూ.10లక్షలకు కొనుగోలు చేయగా రైతులు అసంతృప్తితో ఉన్నారు. పలుమార్లు అధికారులకు తమ సమస్యలను విన్నవించడమే కాకుండా ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఇదిలా ఉండగా.. బివండి, సూరత్, షోలాపూర్ నుంచి వచ్చే వ్యాపారుల కోసం కేఎంటీపీలో ప్రభుత్వం చిన్న యూనిట్లు నెలకొల్పడానికి రూ.135 ఎకరాల స్థలాన్ని ప్రత్యేకంగా కేటాయించిందని తెలుస్తోంది. ప్రతి యూనిట్‌కు వెయ్యి గజాల స్థలాన్ని కేటాయించడానికి ఏర్పాట్లు చేయగా ప్రభుత్వం నుంచి తమకు సహాయ, సహకారాలు సరిగా అందడం లేదని వారు అసంతృప్తితో ఉన్నారు.

పాలిసెట్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు

రామన్నపేట: ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకుగాను వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం సర్టిఫికెట్ వెరిఫికేషన్, ఆప్షన్ల నమోదును ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ తెలిపారు. సర్టిఫికేషన్ వెరిఫికేషన్ పూర్తయిన వారు ఈనెల 21 వరకు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు నమోదు చేసుకోవాలని కోరారు. మొదటి ఫేజ్ వారికి 25న సీటు అలాట్‌మెంట్ వస్తుందన్నారు. 25వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఫీజు కట్టి సెల్ఫ్ రిపోర్ట్ చేయాలని సూచించారు. ఈవెరిఫికేషన్ ప్రక్రియలో మహ్మద్ హైదర్, చంద్రప్రకాశ్, సిస్టమ్ అనాలసిస్ట్ వేముల రామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో..

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పాలిటెక్నిక్ ప్రవేశపరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రారంభమైంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలను ఆకళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రహమాన్, డాక్టర్ సుధీర్, డాక్టర్ నహీదాపర్వీన్, డాక్టర్ రాజేశ్, డాక్టర్ చందర్, డాక్టర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

రూ.120 కోట్లతో తొర్రూరు అభివృద్ధి

- రాష్ట్ర మంత్రి దయాకర్‌రావు
- ట్రాక్టర్ నడిపిన మంత్రి ఎర్రబెల్లి



మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: తొర్రూరు మున్సిపాలిటీని ఉమ్మడి జిల్లాలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని, దీనికి రూ.120 కోట్లు వెచ్చిస్తున్నట్లు రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం డివిజన్ కేంద్రంలో పట్టణ ప్రగతి సంబురాలు నిర్వహించారు. బస్టాండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీలో మంత్రి ట్రాక్టర్ నడుపుతూ ప్రజలను ఉత్సాహపర్చారు. రెండో విడత కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్లు అందించారు. అనంతరం బస్తీ దవాఖాన నిర్మాణానికి శంకుస్థాపన చేసి, ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించారు. స్మశాన వాటికలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రేగూరి సోమయ్య స్మారకార్థం ఏర్పాటు చేసిన వెయిటింగ్ హాల్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన పట్టణ ప్రగతి సంబరాల్లో మంత్రి ప్రసంగించారు. పట్టణంలో రూ.27 కోట్లు వెచ్చించి 24 గంటల పాటు మంచి నీరు అందిస్తామన్నారు. రూ.14 కోట్లతో వర్షపు నీటిని ఒడిసిపట్టే ప్లాంటును ఏర్పాటు చేస్తున్నామని, రూ.2 కోట్లతో దోబీఘాట్లు నిర్మిస్తున్నామని తెలిపారు. తొర్రూరు పెద్ద చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చి పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుతామన్నారు. రూ.5 కోట్లతో అంబేడ్కర్ భవన్, బుడగ జంగాల భవన్‌లను నిర్మిస్తామని హామీనిచ్చారు. పట్టణాల్లో అభివృద్ధి పనుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.16 వేల కోట్లు ఖర్చు చేసిందని గుర్తు చేశారు. అనంతరం అధికారులు, పారిశుద్ధ్య కార్మికులను మంత్రి సన్మానించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అభిలాష అభినవ్, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ హరిప్రసాద్, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, ఆర్డీఓ రమేష్, ఇన్‌చార్జ్ కమిషనర్ సింగారపు కుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీనివాసరావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రామిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్‌సీఐతో ఎస్సార్ యూనివర్సిటీ ఒప్పందం



ఒప్పంద పత్రాలను ప్రదర్శిస్తున్న రిజిస్ట్రార్, సీఈఓ

హసన్‌పర్తి: హైదరాబాద్‌లోని సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(డీఎస్‌సీఐ), ఎస్సార్ యూనివర్సిటీ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈమేరకు ఎస్సార్ యూనివర్సిటీ వీసీ దీపక్ గార్గ్ సమక్షంలో రిజిస్ట్రార్ అర్చనారెడ్డి, డీఎస్‌సీఐ సీఈఓ శ్రీరాం బిరుదవోలు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. పరస్పర ప్రయోజనం కోసం ఇరు సంస్థలు సహకరించుకోవాలని ఒప్పంద పత్రంలో పేర్కొన్నారు. రీసెర్చ్, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, హ్యాక్‌థామ్, కార్పొరేట్ ఇన్నోవేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాం వంటి అంశాలపై మార్గదర్శకత్వం అందజేస్తామని డీఎస్‌సీఐ సీఈఓ శ్రీరాం బిరుదవోలు తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డీన్ డాక్టర్ వి.మహేష్, ఎస్సార్ ఐఎక్స్ సీఈఓ కల్నల్ బి.ఎస్.రావు తదితరులు పాల్గొన్నారు.

ఆ బీఓఎస్ నిర్వాకమే..!

- డిగ్రీ ఇంగ్లిష్ సబ్జెక్ట్ బోధన చేయకున్నా ఆ పేపర్ సెట్
- 20 మార్కులు కలిపే ఆలోచన?



కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో గురువారం జరిగిన డిగ్రీ ఫస్టియర్ రెండో సెమిస్టర్ ఇంగ్లిష్ ప్రశ్నపత్రంలో గ్రామర్‌కు సంబంధించిన ప్రశ్నల్లో మొదటి సెమిస్టర్ ఇంగ్లిష్ సబ్జెక్ట్ సిలబస్ ప్రశ్నలు ఇచ్చిన విషయం తెలిసిందే. ఇందుకు కారణం.. ఇంజనీరింగ్ కళాశాలలో ఇంగ్లిష్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ ఇంగ్లిష్ విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా(బీఓఎస్) బాధ్యతలు నిర్వర్తిస్తున్న డాక్టర్ మేఘనరావు అని వెల్లడైంది. తాను స్వయంగా డిగ్రీ రెండో సెమిస్టర్ ఇంగ్లిష్ సబ్జెక్టు ప్రశ్నపత్రం రూపొందించి పేపర్ సెట్ చేశారనేది గుర్తించారు. ఈవిషయం పరీక్షల విభాగం అధికారులు కూడా ధ్రువీకరించారు. మొదటి సెమిస్టర్ ఇంగ్లిష్ సబ్జెక్టుకు గ్రామర్‌కు సంబంధించిన నాలుగు ప్రశ్నలు వచ్చాయి. ఒక్కో ప్రశ్నకు 5 మార్కుల చొప్పున 20 మార్కులు. దీంతో విద్యార్థులు తమకు సిలబస్‌లో లేని ఆ ప్రశ్నలకు జవాబులు రాసేందుకు ఇబ్బంది పడ్డారు. అయితే ఇతర ప్రశ్నలు వచ్చిన నేపథ్యంలో తమకు మార్కులు కలుపుతారా.. కలిపితే ఎన్ని మార్కులు కలుపుతారనే విషయంపై విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అటెంప్ట్ చేస్తే 20 మార్కులు..?

ఇతర ప్రశ్నలు నాలుగింటికి అటెంప్ట్ చేసిఉంటే 20 మార్కులు కలుపుతామని ఇంగ్లిష్ విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ మేఘనరావు యూనివర్సిటీ పరిధిలోని ఖమ్మం జిల్లాకు చెందిన డిగ్రీ కళాశాల అధ్యాపకుడితో ఫోన్ సంభాషణలో చెప్పటం గమనార్హం.

వీసీ, రిజిస్ట్రార్‌కు నివేదిక !

డిగ్రీ రెండో సెమిస్టర్ ఇంగ్లిష్ సబ్జెక్టు ప్రశ్నపత్రంలో మొదటి సెమిస్టర్ సిలబస్ ప్రశ్నలు రావటంపై అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ముస్తాఫా వీసీ రిజిస్ట్రార్లకు శుక్రవారం నివేదిక ఇచ్చారని సమాచారం. ఈపేపర్‌ను సెట్ చేసింది బీఓఎస్ మేఘనరావు అని కూడా వీసీ, రిజిస్ట్రార్‌ల దృష్టికి తీసుకెళ్లారని తెలుస్తోంది. మేఘనరావుపై చర్యలు తీసుకుంటారా లేదా అనేది వేచి చూడాల్సిందే. మరోవైపు మేఘనరావు బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా రెండేళ్ల టర్మ్ కూడా ఇటీవలనే పూర్తయినట్లు తెలుస్తోంది. ఆమేస్థానంలో వేరేవారిని బీఓఎస్‌గా నియమిస్తారని తెలుస్తోంది. ఇదిలా ఉండగా మేఘనరావు పీజీ ఇంగ్లిష్ విభాగంలో విద్యాబోధన చేయరు కాని పీజీ ఇంగ్లిష్ విభాగానికి సంబంధించిన పలు ప్రశ్నపత్రాలను సెట్‌చేశారని అంతేగాకుండా జవాబుపత్రాల మూల్యాంకణం కూడా చేశారని తెలుస్తోంది.

ఆరునెలల ముందే పేపర్లు సెట్ చేయాలి

ఇటీవల కేయూ పరిధిలో ఎంఫార్మసీ పరీక్షలో ఒక పేపర్‌కు బదులుగా మరో పేపర్‌ను ఆన్‌లైన్‌లో పంపడం.. క్యాంపస్ ఫార్మసీ కళాశాలలో గుర్తించటం మళ్లీ అసలు పేపర్‌ను పంపడం లాంటి ఘటన మరవకముందే డిగ్రీ ఇంగ్లిష్ సబ్జెక్టు ప్రశ్నపత్రం రెండో సెమిస్టర్ పరీక్ష పేపర్‌లో మొదటి సెమిస్టర్ సిలబస్ ప్రశ్నలు రావటంతో పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి దిద్దుబాటు చర్యలు చేపట్టారు. శుక్రవారం అన్ని విభాగాల బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్లతో క్యాంపస్‌లోని పరీక్షల విభాగంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఇక నుంచి ఏ కోర్సుకు సంబంధించిన సబ్జెక్టు ప్రశ్నపత్రాలు అయినా పరీక్షలకు ఆరునెలల ముందే రూపొందించి పేపర్‌సెట్‌లు చేయించి పరీక్షల విభాగానికి సాఫ్ట్‌కాపీ కాకుండా హార్డ్ కాపీని పంపాలని ఆదేశించారు. పేపర్ల సెట్‌లు చేయించాక సబ్జెక్టు ఎక్స్‌పర్ట్స్‌తో పరీక్షల విభాగాల్లో ఆయా ప్రశ్నపత్రాలను మోడరేషన్ చేయాల్సిందేనని ఆదేశించారు.

రిటైర్డ్ ఎంపీడీఓ కిడ్నాప్

బచ్చన్నపేట : జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని పోచన్నపేటకు చెందిన రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య కిడ్నాప్‌కు గురైనట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఎస్సై శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం రామకృష్ణయ్య గురువారం సాయంత్రం నుంచి కనిపించడం లేదంటూ కుమారుడు అశోక్ ఫిర్యాదు చేశాడు. బచ్చన్నపేటకు వెళ్తున్నానని చెప్పి రాత్రి ఇంటికి తిరిగి రాలేదని బచ్చన్నపేటలోనే ఎవరోగుర్తు తెలియని వ్యక్తులు కారులో కిడ్నాప్ చేశారని ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- ఇద్దరు కుమారుల దుర్మరణం.. తల్లిదండ్రులకు గాయాలు
- బాధితులు గొత్తికోయలు



చికిత్స పొందుతున్న భర్త సురేష్, భార్య చిన్నారి

మంగపేట: ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరు కుమారులు చనిపోగా, తల్లిదండ్రులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ విషాద ఘటన ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలోని వైఎస్సార్ సెంటర్‌లోని బొడ్రాయి వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. మృతుల కుటుంబం గొత్తికోయ. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగపేట మండలం కొత్తూరు మొట్లగూడెం పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతం శ్రీరాంనగర్ గొత్తికోయగూడేనికి చెందిన మాడవి సురేష్, భార్య చిన్నారి, కుమారులు శివ (11), నవీన్(05)తో కలిసి ద్విచక్ర వాహనంపై మండల కేంద్రానికి వస్తున్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ నుంచి హనుమకొండకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, కోమటిపల్లి క్రాస్ రోడ్డు వైపు నుంచి మండల కేంద్రానికి వస్తున్న ద్విచక్ర వాహనం బొడ్రాయి సెంటర్ వద్ద ఢీకొంది. దీంతో వాహనంపై ఉన్న దంపతులు సురేష్, చిన్నారి ఎగిరి చెరోపక్క పడిపోగా తల, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. బస్‌కిందికి ద్విచక్రవాహనం వెళ్లడంతో పెద్ద కుమారుడు శివ రెండు కాళ్లపై నుంచి ముందు టైరు వెళ్లడంతో నుజ్జునుజ్జయ్యాయి. చిన్న కుమారుడు నవీన్‌కి తీవ్ర గాయాలయ్యాయి. ఏఎస్సై మల్లెల అబ్బాయ్య స్థానికుల సహకారంతో శివను ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మిగతా ముగ్గురిని మంగపేట పీహెచ్‌సీకి తరలించారు. వైద్యాధికారిణి స్వప్నిత ఆ.. ముగ్గురికి ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శివ, నవీన్ మృతిచెందారు. దంపతులిద్దరిని మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారు. బాధితుల బాబాయి మాడవి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్కే తాహెర్‌బాబా తెలిపారు.



మృతిచెందిన నవీన్

పుట్టినరోజు వేడుకలకు వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి
- పలువురికి గాయాలు



బుచ్చమ్మ (ఫైల్)

కొత్తగూడ: పుట్టినరోజు వేడుకలకు వెళ్తున్న క్రమంలో ఆటో బోల్తా పడడంతో ఓ వృద్ధురాలు మృతిచెందగా.. పలువురు గాయపడ్డారు. కొత్తగూడ ఎస్సై నగేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం మాదన్నపేటకు చెందిన పెండ్యాల బుచ్చమ్మ(70)మనుమరాలి కుమార్తె పుట్టినరోజు వేడుక కోసం శుక్రవారం గుండంపెల్లి మీదుగా పొగుళ్లపల్లికి వస్తుండగా గుండంపల్లి గుడి తండా సమీపంలో మూల మలుపు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో బుచ్చమ్మ అక్కడికక్కడే మృతి చెందగా పెండ్యాల చిరంజీవి నడుము, కాలు విరిగింది. లావణ్యకు కాలు, అనితకు చేయి విరిగడంతోపాటు, మరో అయిదుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు పెండ్యాల నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

బంధం కలుపుకునేందుకు వస్తుండగా..

మాదన్నపేటకు చెందిన పెండ్యాల నర్సయ్య కుమార్తె అంజలి కొత్తగూడ మండలం పొగుళ్లపల్లికి చెందిన రెడ్డి రాకేష్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. అప్పట్లో అంజలి తల్లిదండ్రులు వీరి ప్రేమను అంగీకరించలేదు. దీంతో నాటి నుంచి రెండు కుటుంబాలు దూరంగా ఉంటున్నాయి. అయితే అంజలి కుమార్తె పుట్టినరోజు వేడుకలతో రెండు కుటుంబాలు కలుస్తాయని అనుకున్న సమయంలో రోడ్డు ప్రమాదం వారి కుటుంబాన్ని కన్నీటి సంద్రంలో ముంచింది. ముందుగా పది మందితో బయలుదేరిన ఆటో క్షేమంగా పొగుళ్లపల్లికి చేరుకోగా.. రెండో ఆటోలో అంజలి నాన్నమ్మ బుచ్చమ్మ(70తోపాటు మరో ఎనిమిది మంది బయలు దేరారు. ఈ ఆటోకూడా క్షేమంగా గమ్యం చేరితే అంతా సంతోషంగా ఉండేవారని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో ఉపాధి కూలీ మృతి



యాదమ్మ(ఫైల్)

పాలకుర్తి టౌన్: విద్యుదాఘాతంతో ఉపాధి కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని విస్నూరులో నర్సరీలో చోటుచేసుకుంది. శుక్రవారం గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విస్నూరు గ్రామానికి చెందిన నార్లపురం యాదమ్మ(46) గ్రామ సమీపంలోని నర్సరీలో ఉపాధి హామీ కూలీ(వాచర్)గా పని చేసిచేస్తుంది. నర్సరీ పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో నర్సరీ చుట్టూ ఫినిషింగ్ చేయగా, ట్రాన్స్‌ఫార్మర్‌కు వద్ద ఉన్న ఎర్త్ వైరు ఫినిషింగ్‌కు తగలడంతో మొక్కలకు నీళ్లు పడుతున్న యాదమ్మ విద్యుదాఘాతంతో అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. విస్నూరు గ్రామ పీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శ్రీనివాస్ తన తల్లి యాదమ్మను తీసుకురావడానికి నర్సరీ వద్దకు వెళ్లగా.. అప్పటికే యాదమ్మ మృతిచెంది ఉండడంతో బోరున విలపించాడు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తాళ్ల శ్రీకాంత్ తెలిపారు. విద్యుదాఘాతంతో మృతి చెందిన ఉపాధి కూలీ యాదమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి



లోకేష్(ఫైల్)

జఫర్‌గఢ్/చిల్పూరు/కాజీపేట: రైలు కిందపడి ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన జనగామ జిల్లాలో చోటుచేసుకుంది. జఫర్‌గఢ్ మండలంలోని ఉప్పుగల్లుకు చెందిన వైస్ ఎంపీపీ కొడారి కనకయ్యలక్ష్మి దంపతుల చిన్న కుమారుడు కొడారి లోకేష్ (22) హనుమకొండలోని అద్దెగదిలో ఉంటూ.. వాగ్దేవి కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. గురువారం పరీక్ష రాసి రూమ్‌కు వచ్చిన లోకేష్ రాత్రి సమయంలో రాపిడ్ టూవీలర్ బైక్‌ను బుక్ చేసుకుని బయటకు వెళ్లాడు. ఇదే సమయంలో తల్లితో ఫోన్‌లో మాట్లాడిన లోకేష్ తిరిగి రూమ్‌కు రాకపోవడంతోపాటు అర్ధరాత్రి సమయంలో ఐ మిస్ యూ అంటూ తండ్రికి ఫోన్‌లో మెసేజ్ చేశాడు. తెల్లవారుజామున మెసేజ్ చూసిన కుటుంబ సభ్యులకు ఆందోళనకు గురై స్థానిక పోలీసుల సహకారంతో లోకేష్ ఫోన్ లోకేషన్ ఆధారంగా చిల్పూరు మండలం వంగాలపల్లి రైల్వేగేట్ సమీపాన రైల్వే ట్రాక్‌పై మృతదేహం కన్పించడంతో లోకేష్‌గా గుర్తించారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్‌కు తరలించిన అనంతరం శుక్రవారం మధ్యాహ్నం స్వగ్రామం ఉప్పుగల్లుకు మృతదేహాన్ని తీసుకొచ్చారు.



లోకేష్ తండ్రిని ఓదార్చుతున్న ఎమ్మెల్యే రాజయ్య

మృతిపై అనుమానం

లోకేష్ మృతిపై బాధిత కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. లోకేష్ ఆత్మహత్యకు పాల్పడ్డా.. లేక మరేదైనా జరిగి ఉంటుందా..? అనే కోణంలో గ్రామస్తులు చర్చించుకోవడం గమనార్హం.

ఎమ్మెల్యే ఓదార్పు

లోకేష్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజయ్య ఉప్పుగల్లులో బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. లోకేష్ తండ్రి కనకయ్యను ఓదార్చే క్రమంలో ఎమ్మెల్యే రాజయ్య కంటతడి పెట్టారు. ఎమ్మెల్యేతోపాటు ఎంపీపీ సుదర్శన్, జెడ్పీటీసీ బేబి శ్రీనివాస్, రాజు, జ్యోతి, రజిత, యాకయ్య, స్రవంతి, మొగిళి, వెంకటస్వామి, రజిత, నీలమ్మ, సోమిరెడ్డి, సుభాష్, భిక్షపతి, నూకల ఐలయ్య, సత్యానారాయణరెడ్డి పరామర్శించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

- One year 10th, Inter, NIOS, TOSS, APOSS, Degree & PG, Year Wise Nagarjuna, SV University Guidelines for B.Tech, Detained, Failed Students Cont: NICC KPHB Hyd. Ph: 9515390685, 8179882462 [H-788704]

REAL ESTATE

HOUSE FOR SALE

- GWMC అప్రూవ్డ్ లే అవుట్ చింతగట్టు హన్మకొండలో విల్లా ప్లాట్లు 4BHK డూప్లెక్స్ హౌజ్ 3BHK ఇండిపెండెంట్ హౌజింగ్ ప్రాజెక్ట్‌లో బుకింగ్ ప్రారంభమైనవి. శ్రీనివాస్. సెల్: 8978638094. [W-785610]

కుడా లేఅవుట్ ప్లాట్లు అమ్మబడును

- కుడా లేఅవుట్ ప్లాట్లు అమ్మబడును. GWMC పరిధి, చింతగట్టు హన్మకొండ, న్యూ వెంచర్ ఓపెనింగ్ 14/06/2023. DP.No. TCPNo: 0414/LO/3006/2023 ఆఫీస్ సుబేదారి, టి.స్వామి. 968331226. [W-785605]

HOUSE & ఇల్లు అమ్మకం

- వరంగల్ చౌరస్తాకి 7 కి.మీ॥ ఖమ్మం హైవేకి 500 మీటర్ల వ్యాలీకి 21/2 కి.మీ. ముందు మామునూర్ ఎత్తైన ప్రదేశం 390 చదరపు గజాలు G+1 పైన 4 క్రింద 3 రూంలు 1560 Sft తూర్పు ఫేసింగ్ 40 ఫీట్ల రోడ్ దక్షిణం 40 ఫీట్ల S/E కార్నర్ ప్లాటు చుట్టు కుడా లే అవుట్ దగ్గర్లో నిర్మిత నిర్మాణమౌతున్న ఇల్లు. 9032111600. [W-785603]

PLOT FOR SALE

- ఓగ్లాపూర్ పవర్‌గ్రిడ్‌కు ఎదురుగా 200 ఫీట్ రోడ్‌కు ఆనుకొని కాంపౌండ్ కట్టి ఉన్న ప్లాటు (వెడల్పు 30 పొడవు 120) 400 చ॥గ॥ ప్లాటు అమ్మబడును. సంప్ర॥ 9849544437. [W-785598]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥లు మాత్రమే 5% GST అదనము

SERVICES

పాస్‌పోర్ట్ పోయినది

- BEMBIRI SHESHU, S/o. KOTI, H.No. 1-65, కోనాయిమాకుల గ్రామం, గీసుగొండ మండలం, వరంగల్ జిల్లా గార్లది Passport Bearing No: W1369188 issued on 26-05-2022 and valid upto 25-5-2032, issued at Hyderabad గలది. బైక్‌పై కోటగండి నుండి కోనాయిమాకుల వరంగల్‌కు వస్తుండగా తేది: 12-6-2023 ఉ॥ 9.30 ప్రాంతంలో ఎక్కడో పడిపోయినది. దొరికినవారు ఈ క్రింది నెంబర్‌కి తెలుపగలరు. 8096586518. [WA-785651]

WANTED

- హన్మకొండ Oil Shop లో పని చేయుటకు Male Worker కావలెను. Salary: 10,000/- టైం: 8am to 6pm. సెల్: 8008255152. [W-785606]
- వాచ్‌మెన్ మరియు రూమ్ బాయ్స్ అర్జెంటుగా కావలెను. ఆకర్షణీయమైన వేతనం ఇవ్వబడును. సంప్రదించండి. సెల్: 7799007778. [W-785600]
- ప్రముఖ గ్లోబల్ కంపెనీలో వర్క్ చేస్తూ నెలకు 35,000/- వరకు సంపాదించే అవకాశం. 100% ఎటువంటి ఫీజులు ఉండవు. Work From Home. ఫోన్: 85001 48297 [V- 794635]
- ఇంటిపని, బేబీకేర్, పేషెంట్ కేర్, వంటపని భార్యాభర్తలు, Sal: 15K to 30K రూం+ భోజనం, లోన్, బోనస్ ఫ్రీ. Ph: 9160002192, 9160002193. [H-781332]
- లేపాక్షి హెల్త్ కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ:18k. ఏజెంట్ కమీషన్ 6k. ఫోన్ 9640400073 [HA-284]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

- హైదరాబాద్ లో బేబీకేర్, పేషెంట్ కేర్, ఇంటిపని, వంటపని సెక్యూరిటీ పని చేయుటకు అర్జెంటుగా కావలెను. జీతం: 15-25 వేలు, రూం+మీల్స్ ఫ్రీ, 12గం. & 24/7గం. ఫోన్ : 9701155505. [HA-30868]

WANTED TEACHERS

- To teach all subjects, for classes I to X, PET and Car driver Cum attender Contact Immediate, Salary Negotiable Cell: 9849211563, 9951465223. [WA-0270]
- Pre-Primary Teachers-2, Primary Teachers Maths, Science, Spoken English. High School: Phy.Sci, Bio.Sci, Social, PET. Contact within 2 days. Standard High School, Kashibugga, WGL. 8522066699, 9949553298. [W-785599]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.